## జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ



అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుదీర్‌ల నుమర్యాద పూర్వకంగా కలిసి శుభా కాంక్షలు తెలుపుతున్న వెంకటరమణ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా బదిలీపై వచ్చిన జి. వెంకటరమణ శుక్రవారం బాద్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బంది, ప్రోగ్రాం అధికారులు బదిలీపై వచ్చిన డిఎంహెచ్ఓకు పుష్పగుచ్ఛా, శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం డీఎంహెచ్ వెంకటరమణ జాయింట్ కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ జీవరాజ్, డాక్టర్ రవీంద్రయాదవ్, వి.శ్రీనివాసులు ఉన్నారు.





రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడిని కలిసిన షాద్‌నగర్ న్యాయవాది



**షాద్‌నగర్, ప్రభాతవార్త, (నవంబరు 01) :** టీటీడీ చైర్మన్‌గా టీవీ5 ఛానల్ అధినేత బీఆర్ నాయుడిని నియమించడం హర్షనీయమని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది మోముల బసప్ప కొనియాడారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయనను కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా నాట్కో గ్రూప్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు బోర్డు సభ్యులుగా ఎంపికైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మోముల బసప్ప మాట్లాడుతూ సామాన్య రైతు కుటుంబం నుంచి టీటీడీ చైర్మన్‌గా బి.ఆర్.నాయుడు ఎదగడం గొప్ప విషయమని అన్నారు.

# పోషకాల మధురఫలం.. సీతాఫలం



కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు ఎగుమతికి సిద్ధం

**నిరుపేద కుటుంబాల జీవనాధారం**
**షాద్‌నగర్ సీతాఫలానికి భలే డిమాండ్**
**షాద్‌నగర్ నుండి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి**

**షాద్‌నగర్, నవంబరు 1: ప్రభాతవార్త** తింటే గారెలు తినాలి.. వింటే భారతం వినాలి అన్నారు పెద్దలు.. ఇప్పుడు మరో మాట చెప్పాల్సి వస్తే సీజన్‌లో తింటే సీతాఫలాలు తినాలి అనాలి. పల్లెటూరి మధుర ఫలంగా పేరుగాంచి ప్రతి వర్షాకాలంలో నిరుపేద కుటుంబాల జీవనాధారంగా నిలుస్తున్న సీతాఫలాలకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉంది. ఔషద గుణాలు విరివిగా కలిగిన సీతాఫలాలను సీజన్ వారీగా అన్ని వర్గాలు ఎంతో మక్కువతో తింటారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రాంతానికి సంబంధించిన సీతాఫలాలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. సీజన్‌లో షాద్‌నగర్ నుండి హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం రాయిచూర్, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, నందికొట్కూర్, కర్నూల్, ప్రకాశం జిల్లాలకు షాద్‌నగర్ నుండి పెద్దఎత్తున సీతాఫలాలు ఎగుమతి అవుతున్నాయి. కండకాయ, గుడ్లకాయలుగా పిలిచే రకాలు ఇక్కడ ఎల్లప్పటికీ ప్రత్యేకం. పక్కనే ఉన్న ఉమ్మడి పాలమూరు జిల్లా ఒకప్పటి షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఉమ్మడి మండలమైన బాలానగర్, షాద్‌నగర్ సీతాఫలాలకు పెట్టింది పేరుగా చెప్పవచ్చు. విదేశాలకు కూడా షాద్‌నగర్, బాలానగర్‌లకు చెందిన సీతాఫలాలు ఎగుమతి అవుతాయంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ఎన్నో పోషక, ఔషద విలువలు ఉన్న సీతాఫల వృక్షానికి వర్షపు నీరే ప్రాణాధారం. ఎలాంటి ఎరువులు, మందులు అవసరం లేకుండానే ఇవి సహజ సిద్ధంగా అడవుల్లో, చెట్ల పొదల్లో, పొలాల గట్లపై విరివిగా లభించడంతో వీటి రుచికి సాటిలేదు. పల్లెటూరి మధురమైన ఫలంగా ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారు.

### రవాణా చేస్తే పన్ను కట్టాల్సిందే

సీతాఫలాలు అడవికి వెళ్లి ప్రజలు తీసుకువస్తే ఎవరేమీ అనరు కానీ.. గూడ్స్ వాహనాల్లో వీటిని తరలిస్తే మాత్రం అటవీశాఖ పన్నులు వసూలు చేస్తుంది. షాద్‌నగర్ నుండి ప్రతియేటా లక్షలాది రూపాయల మార్కెట్ జరుగుతుంది. నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు, ఫరూఖ్‌నగర్ మండలాల నుండి ఈ పండ్లు తెచ్చి సీతాఫల్ మండిలో వ్యాపారస్తులకు విక్రయిస్తారు. స్థానిక చౌడమ్మగుట్ట వద్ద వీటి మార్కెట్ ఉంది. షాద్‌నగర్ నుండి హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్, ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, నందికొట్కూర్, కర్నూల్, ప్రకాశం జిల్లాలకు ఈ ప్రాంతం నుండి సీతాఫలాలను ఎగుమతి చేస్తున్నారు. ఆటోలు, మొబైల్ వాహనాలు, డీసీఎంల ద్వారా వివిధ ప్రాంతాలకు వీటిని ఎగుమతి చేసి వ్యాపారస్థులు సైతం రెండు చేతులా సంపాదిస్తున్నారు. ఈ సీజన్‌లో ఉదయం 7 గంటల నుండి షాద్‌నగర్ సీతాఫల మార్కెట్‌లో పెద్దఎత్తున వ్యాపారం జరుగుతుంది. ఇక పక్కనే చిరు వ్యాపారులు ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు సీతాఫలాలను మహిళలు విక్రయిస్తారు. ప్రజలు వీటిని కొనడానికి వివిధ ప్రాంతాల నుండి ఇక్కడికి వస్తారు. అదేవిధంగా టెలిఫోన్ ఎక్చేంజ్ వద్ద, పండ్ల వ్యాపారుల వద్ద సీతాఫలాలను అమ్మకానికి పెడతారు. ఈ సీజన్‌లో వీటికి భలే గిరాకీ.

### బుట్టలో పడడం ఖాయం

పల్లెటూరి మధుర ఫలంగా పేరు గాంచిన సీతాఫలం రక్తహీనత ఉన్నవారు, గర్భాధారణ సమయంలో హిమోగ్లోబిన్ లోపం ఉన్న మహిళలు ఇక్కడి పండ్లను సంప్రదాయంగా తింటారు. ఇక కంటి, గుండె ఆరోగ్యానికి ఇది మేలు చేస్తుంది. సూక్ష్మ పోషకాలు ఈ పండులో పుష్కలంగా లభిస్తున్నా యి. ముఖ్యంగా ఈ సీజన్‌లో సీతాఫలానికి సంబంధిం చిన స్వీట్స్ ఇక్కడ ప్రత్యేకం. వివాహాలు, ఇతర శుభకార్యాలలో సీతాఫల పాయసం (సీతాఫల్ రబిడీ), స్వీట్స్ ఇక్కడ తయారు చేసి వడ్డిస్తారు. సీతాఫల పాయసం ఎంతో రుచికరంగా ఉంటుంది.



షాద్‌నగర్ పట్టణంలో సీతాఫలాల మార్కెట్

### అందరికీ ప్రత్యామ్నాయ ఆర్థిక ఆదాయం నలమోని శ్రీధర్

ఈ సీజన్‌లో పేద, మధ్య తరగతి గ్రామీణ ప్రజలకు అందరికీ సీతాఫలాలు ప్రత్యామ్నాయ ఆర్థిక ఆదాయంగా ఉంటాయని షాద్‌నగర్ పట్టణానికి చెందిన సీతాఫల వ్యాపారి నలమోని శ్రీధర్ ముదిరాజ్ తెలిపా రు. ఈ ప్రాంతం నుండి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కు వాహనాల ద్వారా సీతాఫలాల లోడ్లను పంపిస్తుంటామని తెలిపారు. అటవీ శాఖకు పన్నులు చెల్లించి, ప్రభుత్వానికి ఈ పంట ద్వారా ఆదాయం కూడా సీజన్‌లో సమకూరుస్తుంటామని అన్నారు. పేదవాడి మధుర ఫలాలలో ఇది రారాజు అని శ్రీధర్ ముదిరాజ్ అన్నారు. సీతాఫలాలు సీజన్‌లలో వ్యాపారం చేసి అప్పులు తీర్చుకునే వారు, ఏదైనా వస్తువులు కొనుక్కోవాలనుకునే వారికి ఇది ప్రత్యామ్నాయ ఆదాయంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఏడాది ఇక్కడ సీతాఫల వ్యాపారం బాగానే జరుగుతుందని అన్నారు. మిగతా ప్రాం తాలతో పోలిస్తే షాద్‌నగర్, బాలానగర్ ప్రాంతాలకు చెందిన సీతాఫలాలకు ప్రత్యేకత ఉంటుందని, ఇక్కడ కాయలు కండ రకం, బొట్ల కాయ లభించడం వల్ల వాటి రుచి ఎక్కడా లభించదని ఆయన తెలిపారు. అందుకే ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడం ద్వారా ఎక్కువ డిమాండ్ ఉంది.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

**వుడా పరిధిలో రూ.200 కోట్లు !**
**ప్రతి మండలానికీ సమాన వాటా**
**పీఆర్ రహదారుల అభివృద్ధికి సర్కార్ అంచనాలు**



కమాల్‌పూర్ నుంచి బాగైపల్లి రోడ్డు పనులు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** పాలనపై పట్టు బిగిస్తున్న రేవంత్ సర్కార్ గ్రామీణ రహదారుల అభివృద్ధికి దండిగా నిధులు కేటాయించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో పంచాయత్‌రాజ్ ఇంజనీరింగ్ విభాగం పరిధిలో రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. వుడా పరిధిలో రూ.200 కోట్లను వెచ్చించి రహదారులు మెరుగుపరచాలని అంచనాలు తయారు చేస్తున్నట్లు అధికారవర్గాల సమాచారం. ప్రతి మండలానికి రూ.10 కోట్ల మేరకు వెచ్చించి పనులు చేపడతారని భావిస్తున్నారు. జిల్లా పరిధిలోకి వచ్చే వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి నియోజకవర్గాలలో ఈ పనులకు అంచనాలు తయారు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి రోడ్ల అభివృద్ధిపై చర్చించినట్లు సమాచారం. వర్షాకాలం పూర్తయినందున అంచనాలు రూపొందించి వెనువెంటనే పనులకు టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. కొడంగల్ నియోజకవర్గంలో చాలా గ్రామాలలో పెండింగ్లో ఉన్న పీఆర్ రోడ్ల పనులు ప్రారంభమైనాయి. అంగడి రైచూర్ నుంచి రుద్రారం వరకు, కస్తూర్‌పల్లి నుంచి నీళ్లపల్లి రోడ్ల పనులు ప్రారంభించిన విషయం తెలిసిందే. యాలాల మండలం దేవనూర్ నుంచి బొంరాస్‌పేట మండలం మాహంతీపూర్ మీదుగా రోడ్డు పనులను చేపట్టనున్నారు. నాగిరెడ్డిపల్లి నుంచి కొత్తూరు రోడ్డు పనులు ప్రారంభమైనాయి. ఈ పనులను దేవనూర్ వరకు పొడగించాలని ప్రజలు కోరుతున్నారు. ముద్దాయిపేట నుంచి బుర్హాన్‌పూర్, సంగాయిగుట్ట తండాల రోడ్లు మెరుగు పడనున్నాయి. జిల్లాలో చాలా మండలాల్లో పీఆర్ రోడ్లకు గత పదేళ్లగా మోక్షం లభించలేదు. మారుమూల గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యానికి దూరమైనా పాలకులు పట్టించుకోలేకపోయారు. ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించడంతో రాబోయే వర్షాకాలం నాటికి రోడ్లు మెరుగుపడతాయని భావిస్తున్నారు.

### వేగమంతంగా ఆర్అండ్‌బీ రోడ్ల పనులు

యాలాల మండలం పగిద్యాల నుంచి కమాల్‌పూర్ వరకు ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులు వేతమంతంగా సాగుతున్నాయి. 20 ఏండ్ల క్రితం వేసిన సింగిల్ రోడ్డు ఆరు కిలోమీటర్ల పొడవునా శిథిలావస్థకు చేరుకున్న విషయం తెలిసిందే. తాండూరు నుంచి ధారూరు వరకు ఈ రహదారి గుండా రవాణా చేస్తుంటారు. 2012-13లో మంత్రి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డి చొరవతో తాండూరు నుంచి కమాల్‌పూర్ వరకు రోడ్డు విస్తరించారు. కానీ మిగిలిన పనులు పూర్తి చేయలేకపోయారు. ఐదారేండ్ల క్రితం హైదరాబాద్ ప్రధాన రహదారిపై వంతెనలు తెగిపోవడంతో వాహనాల రాకపోకలను కమాల్‌పూర్, బాగైపల్లి మీదుగా కొనసాగించారు. దాంతో ఈ రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. ప్రస్తుతం శాసనసభ్యుడు బుయ్యని మనోహర్‌రెడ్డి, ఆయన సోదరుడు శ్రీనివాస్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో రహదారి విస్తరణ చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు. అందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఈ రహదారి విస్తరణకు రూ.8 కోట్లు మంజూరు చేయించారు. టెండర్లు పూర్తి చేసుకున్న తర్వాత రెండు వారాలుగా పనులు వేగమంతంగా సాగుతున్నాయి. పనుల నాణ్యత మేరకు మరో 2 కోట్ల రూపాయల వరకు పెంచే అవకాశాలు ఉన్నాయి. చాలా ఏళ్ల తర్వాత కమాల్‌పూర్ నుంచి బాగైపల్లి మీదుగా పగిద్యాల వరకు ఆర్అండ్‌బి రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 20 శాతం వరకు పనులు చేపట్టారు. పలుచోట్ల కల్వర్టులను నిర్మించి మార్చి వరకు రహదారి పనులు పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. తాండూరు నుంచి వికారాబాద్ మీదుగా మన్నెగూడ వరకు రహదారి విస్తరణ పనులు కూడా త్వరలో ప్రారంభించనున్నారు. కరణ్‌కోట నుంచి గౌతాపూర్ వరకు పనులు చేపట్టనున్నారు. మరోవైపు జుంటుపల్లి నుంచి బండమీదిపల్లి వరకు రోడ్డు పనులు పూర్తి కావచ్చాయి.

## సమగ్ర ఇంటింటి సర్వే తనిఖీ



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ఇళ్ల కేటాయింపును వారి తీరును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గౌతమ్,పాల్గొన్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), నవంబరు 1, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగ చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను, ఎన్యుమరేటర్ల సర్వే పనితీరుపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించి తనిఖీలు చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన శామీర్‌పేట గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతున్నందున జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించి పర్యటించి తనిఖీలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగ చేపడుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) కోసం ఇంటింటికి అతికించిన స్టిక్కర్స్ ను కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. సర్వేకు సంబంధించిన ప్రొఫార్మాలను పరిశీలించి ఏ విధంగ నమోదు చేస్తున్నారని, కుటుంబ సభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని, మీకు ఎన్ని ఇండ్లు కేటాయించారని సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో కుటుంబ యజమాని గాని, సభ్యులుగాని స్వచ్ఛందంగ తెలిపిన వివరాలను మాత్రమే ప్రోఫార్మాలలో నింపాలని కలెక్టర్ సూచించారు. సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు హాజరు అవుతున్నారా అని ఎంపిడిఓ మమతాబాయిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆధార్, ఓటరు కార్డులు ఉన్న వారి వివరాలను తప్పక నమోదు చేయాలని కలెక్టర్ గౌతమ్ వారికి సూచించారు.

## గొప్ప మనసు చాటుకున్న బిఆర్ఎస్ నాయకుడు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (నవంబరు 01) :** ఫరూఖ్‌నగర్ మండలం కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కంది యాదయ్య గౌడ్ కంసాన్‌పల్లి గ్రామం నుండి చౌలపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా దట్టంగా పెరిగిన కంప చెట్లు, ముళ్ల పొదలను తన సొంత ఖర్చులతో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంతో అటుగా వచ్చే ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చెట్లను తొలగించడం వల్ల ప్రమాదాలు తగ్గి ప్రయాణం సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పరిసర గ్రామాల ప్రజలు కంది యాదయ్య గౌడ్‌ను అభినందించారు.



ముళ్ల పొదలను తొలగించిన అనంతరం కంసాన్‌పల్లి-చౌలపల్లి రోడ్డు

# సమగ్ర కుటుంబ సర్వే పక్కాగా చేపట్టాలి

**అదనపు కలెక్టర్ సుధీర్**



సర్వే వివరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ తెలిపారు. శుక్రవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ా వికారాబాద్ మండలం మదనపల్లిలో అదనపు కలెక్టర్ సుధీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎ న్యుమరేటర్లను ఉద్దేశించిమాట్లాడుతూ, గ్రామాల్లో సర్వే నిమిత్తం వెళ్లినప్పుడు ఇంటి యజమానిని పూర్తి వివరాలు అడిగి తెలుసుకోవాలన్నారు. యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని ఆయన సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేపట్టాలని, ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఎంపీడీవో వినయ్ కుమార్, సర్వే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### కొడంగల్ మండల పరిధిలో..

**కొడంగల్, నవంబర్1, ప్రభాతవార్త :** కొడంగల్ మండల పరిధిలోని పర్సపూర్, హస్నాబాద్ గ్రామాలలో సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం నుండి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ఇంచార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ తహసీల్దార్ విజయ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో సర్వేప్రక్రియను పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందించే ప్రక్రి కాబట్టి ప్రొఫార్మాను క్షుణంగా చదివి ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను పొందుపరచాలని వారు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకొని ఇచ్చిన ప్రొఫార్మాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని తెలిపారు. ప్రతిఇంటిని తప్పనిసరిగా సందర్శించి వివరాలను సేకరించాలని వారు తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ దుద్యాల్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబసర్వేను పరిశీలించారు. గ్రామంలో 150 నుండి 170 కుటుంబాలను ఒక బ్లాక్‌గా తీసుకొని 56ప్రశ్నలు, ఉపప్రశ్నలతో కుటుంబాల వివరాలు ఇంటినంబర్‌లో స్టికర్ వేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 6వ తేది నుండి 18వ తేది వరకు క్లుప్తంగా సర్వే నిర్వహించి ఆన్‌లైన్‌లో వివరాలను పొందుపరచడం జరుగుతుంది తెలిపారు. సర్వేలో చేపట్టాల్సిన వివిధ అంశాలను ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేష్‌బాబు, రవికిషోర్ ఆర్ఐ, సత్యనారాయణ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర ఇంటింటి సర్వే వివరాలు అడిగితెలుసుకుంటున్న ఇంచార్జి కలెక్టర్ సిక్తా పట్నాయక్

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (నవంబరు 01) :** ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల ను వెంటనే చెల్లించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ ఇంచార్జి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల చదువుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఎమ్మెల్యేను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఎనమిది వేల కోట్ల రూపాయలను విడుదల చేయకపోవడంతో 13 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా రని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ షాద్‌నగర్ అధ్యక్షులు నరేష్ రాథోడ్ పాల్గొన్నారు.

# దళారులను రైతులు నమ్మవద్దు

**అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్**

**బొంరాస్‌పేట్/దుద్యాల్, నవంబర్1, ప్రభాతవార్త :** దుద్యాల్ మండలంలోని పోలేపల్లి, హకింపేట్, లగచర్ల, ఆర్‌బితాండ, పులిచెర్లకుంటతాండల రైతులు ఫార్మవలన తమ భూములు కోల్పోతున్నమని ఫార్మాకంపెనీకి వ్యతిరేఖంగా గత కొన్ని నెలలలుగా ధర్నాలు, రాస్తారోకోలు నిరహర దీక్షలు చేస్తున్నారని, ఫార్మా కంపెనీ వల్ల భూములు కోల్పోతున్న రైతులు అపోహలను నమ్మవద్దని తహసీల్దార్ కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యలయంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌లు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేయబోయేది ఫార్మాకంపెనీలు మాత్రమే కాదని అలైడ్ ఫార్మా అని తెలిపారు. ఫార్మాతోపాటు వివిధ కంపెనీలు ఇక్కడ ఎర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దీని ద్వార ఎలాంటి కలుషితంకాదని షామీర్‌పేట్‌లో ఉన్న జెన్యూన్‌వ్యాలీ మాదిరిగా వివిధ కంపెనీలు ఇందులో ఉంటాయన్నారు. ఇక్కడ నివాస గ్రామాలు, తాండలు పోవడంలేదని రైతులు, ప్రజలు అపోహలు నమోద్దనిరైతులు తమను కలిసిన సమయంలో పరిహారం పెంచమని కోరడం జరిగిందని నిబంధనల ప్రకారం పరిహారం పెంచెందుకు ఆలోచిస్తున్నమన్నారు. అలైడ్ ఫార్మా ద్వార ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఇప్పటి వరకు ఎకరాకు 10 లక్షల రూపాయాలు, డిటీసీపి లేఅవుట్‌లో 125 గజాల ప్లాట్, ఇందిరమ్మ ఇళ్లు, ఔట్‌సోర్సి ంగ్ ఉద్యోగం కల్పిస్తామన్నారు. రైతుల నుండి బలవంతంగా భూములను లాక్కోవడంలేదని ప్రభుత్వం అధికారులు గ్రామసభలు నిర్వహించి రైతులు, ప్రజల అపోహలను తొల గించి అందరి సమ్మతితోనే భూసేకరణ చేస్తామన్నారు. సబ్‌కలెక్టర్ ల్యాండ్, సర్వే రికార్డ్స్ డిపార్టుమెంట్‌లో భూసేకరణకు సంబంధించిన పరిహారం డబ్బులు రేడిగా ఉన్నాయన్నారు. రైతులకు పరిహారం చెల్లించడంతోపాటు ఇందిరమ్మ ఇళ్లలో కూడా మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్ధార్ వీరేష్‌బాబు, ఆర్ఐ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### కన్నులపండువగా దీపావళి సంబురాలు

**షాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త :** దీపావళి పండుగను పురస్కరించుకుని షాబాద్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. టపాకాయలు, దీపాలు, బొమ్మల కొలువుల, కేదారేశ్వరస్వామి వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. మామిడి తోరణాలు, బంతి పూలు, విద్యుత్ దీపాలతో దుకాణ సముదాయాలను అలంకరించారు. వ్యాపారులు లక్ష్మిపూజలు చేశారు. ఇళ్లను దీపాలతో అలంకరించి లక్ష్మిదేవికి స్వాగతం పలికారు. చిన్నా, పెద్ద తేడాలేకుండా బాణసంచా కాల్చి కన్నులపండువగా జరుపుకున్నారు.

## మానసిక ప్రశాంతతకు ఆదియోగి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం : ఎమ్మెల్యే శ్రీగణేష్



మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికలో ఆదియోగి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, నవంబర్ 1 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు మృతి చెందిన వారి జ్ఞాపకాలను దృష్టిలో ఉంచుకొని ఆదియోగి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి మారేడ్‌పల్లి హిందూ స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన ఆదియోగి విగ్రహాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కేర్‌టేకర్ సదానంద్, వెంకట్ స్వామి, హంసరాజ్, ముత్యాలు, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయి : జంపన



1వ వార్డు బాపూజీ నగర్ నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్, నవంబర్ 1 ప్రభాతవార్త:** అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మి నారాయణరెడ్డిలు తెలిపారు. హుమాన్ పౌండేషన్ వ్యవస్థాపకుల ప్రకాశ్ బాంటియా, వి.ఆర్.ఆర్.ఆసుపత్రి ఎండి నంది కిషోర్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. దీపావళి, అమావాస్యను పురస్కరించుకొని గురువారం బోయిన్‌పల్లి బాపూజీ నగర్ శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, ప్రేమ్ ముదిరాజ్, జహింగీర్, నరిసింహ్మా, రామారావ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కుల సర్వే సమగ్రంగా చేపట్టాలి : డిసి



**అత్తాపూర్ నవంబరు1, ప్రభాతవార్త :** నూరుశాతం ఖచ్చితత్వంతో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ కుల సర్వే సమగ్రంగా చేపట్టాలని రాజేంద్రనగర్ డిసి రవి కుమార్ పేర్కొన్నారు. నవంబరు 6 నుండి చేపట్టే ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై శుక్రవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని రాయల్ హయత్ కన్వెన్షన్‌లో ఎన్యుమరేషన్ బ్లాక్ సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువరు అధికారులు వారికి సమగ్ర కుటుంబ సర్వేపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిసి రవి కుమార్ మాట్లాడుతూ... ఈనెల 6 నుండి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబం సర్వేను ఎన్యూమరేటర్స్, సూపర్‌వైజర్లు పకడ్బందీగా నిర్వహించారు. ప్రభుత్వం సూచించిన విధంగా ఫారంలో కుటుంబ సభ్యుల పేరులను నమోదు చేయాలని సూచించారు. సర్వే ఎదురయ్యే సాధారణ సమస్యలను పరిష్కరించుకుంటూ సర్వే విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసి అశోక్ స్మార్ట్, ఎపిపి నోడల్ అధికారి, ఎఎంసి జయ ప్రకాష్, సర్కిల్ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, డా.శ్రీకాంత్, డా.వసీం, టౌన్‌ప్లానింగ్ ఎసిపి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

**అత్తాపూర్‌లో పారిశుధ్య పనుల పరిశీలన**

చెత్తను తొలగించడంలో పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని డిసి రవి కుమార్ సూచించారు. శుక్రవారం అత్తాపూర్ వార్డులోని కమర్షియల్ స్ట్రీట్‌లలో డిసి రవి కుమార్ పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ.... పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు కృషి చేయాలి తెలిపారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



**అత్తాపూర్ నవంబరు1, ప్రభాతవార్త :** సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి కార్యక్రమాన్ని అత్తాపూర్ డివిజన్‌లోని హైదరగూడ సర్దార్ పటేల్ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు సాబాద విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపి కొండా మాట్లాడుతూ....దేశం అఖండ భారతదేశంగా ఉండడానికి ఆనాటి ఉప ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రులు సర్దార్ వల్లభాయ్ పటేల్ 565 సంస్థానాలను దేశంలో విలీనం చేశారని 1978లో సర్దార్ వల్లభాయ్ పటేల్ మిలిటరీ యాక్షన్ ద్వారా నిరంకుశ నిజాం మెడల్ వంచి రజాకార్ల పాలనను అంతమొందించి తెలంగాణకు స్వతంత్రం తెచ్చిపెట్టిన మహాభావుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారాగూడెం మల్లారెడ్డి, మొండ్ర కొమరయ్య, కాడెం సుధాకర్, కార్పొరేటర్ సంగీ, సీనియర్ నాయకులు మొండ్ర నర్సింహా, పుస్తకాల అశోక్, ఎస్.బి హరినాథ్, సత్యనారాయణ, ఎస్ జయానంద్ రెడ్డి, కిరణ్ చారి, ఎస్.వెంకటేష్, రమేష్, ఎస్.వాసు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వం హస్తకళ వృత్తికళాకారులకు ప్రోత్సాహన్ని అందిస్తుంది : దేవకి**

**కంటోన్మెంట్, నవంబర్ 1 ప్రభాతవార్త:** హస్తకళ వృత్తుల కళాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహన్ని అందిస్తుందని అభ్యుదయ గ్రామీణ ద్వారా రాష్ట్ర అధ్యక్షురాలు దేవి దేవకి తెలిపారు. శుక్రవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు.

## భక్తి,శ్రద్ధలతో దీపావళి వేడుకలు జరుపుకున్న ప్రజలు

**నార్సింగి, నవంబర్ 1 ప్రభాతవార్త :** గండిపేట్ మండల పరిధిలోని ప్రజలు "దీపావళి" వేడుకలను భక్తి,శ్రద్దల మధ్య జరుపుకున్నారు. మండల పరిధిలోని వట్టినాగులపల్లి, ఖానాపూర్, గండిపేట, కోకాపేట్, నార్సింగి, మణికొండ, పుప్పాలగూడ, నెక్నాంపూర్, మంచిరేవుల, గంధంగూడ, హైదర్షాకోట్, పీరంచెరువు, బండ్లగూడ కిస్మత్‌పూర్, హిమాయత్ సాగర్ గ్రామాలల్లో ఉన్న ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దీపావళిని పురస్కరించుకొని చాలా మంది భక్తులు ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, అన్నదానాలు, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. గురువారం సాయంత్రం లక్ష్మీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపావళి వేడుకలను కన్నుల పండువగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దీపావళి పర్వదినంను ఎందుకు జరుపుకుంటారో వివరించే పాటలు, నాటికలు వేసి వివరించారు. ఒక దీపంతో మరో దీపంను వెలిగించి మన జీవితంలోని అంధకారమంతా ఈ రోజుతో తొలిగి పోవాలని భక్తులందరూ లక్ష్మీ మాతను కోరుకున్నారు. పలు ఆలయాల్లో పుర ప్రముఖులు మాట్లాడుతూ హిందువులు జరుపుకునే ప్రతీ పర్వదినం వెనుకాల ఓ ఆరోగ్య రహస్యం దాగి ఉంటుందన్నారు. హిందూ అంటే మతం కాదని, మానవాళి అనుసరించదగ్గ జీవన విధానమని స్పష్టం చేశారు. పర్వదినాలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావి తరాలకు అందించేందుకు వారధులుగా ఉపకరిస్తాయన్నారు. ఎవరి మతంను వారు ఆచరిస్తూనే ఇతరుల మతాలను గౌరవించినప్పుడే సోదర, సౌభాతృత్వాలు వెల్లివిరుస్తాయని వివరించారు. బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు, మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డిలు ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. లక్ష్మీమాత పూజల అనంతరం చిన్న,పెద్ద,ఆడ,మగ అందరూ కలిసి ఇళ్లంతా దీపాలు వెలిగించి, బాణాసంచాను పేల్చి సంబరాలు జరుపుకున్నారు.



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న మణికొండ మున్సిపల్ ప్రజలు.

### భాగ్యలక్ష్మిమందిరంలో మాజీ కార్పొరేటర్ పూజలు



భాగ్యలక్ష్మిమందిరంలో పూజలు చేసిన మాజీకార్పొరేటర్ దంపతులు పి.మమతసంతోష్‌గుప్త

**బేగంబజార్, నవంబర్ 1ప్రభాతవార్త:** దీపావళి పండుగ పురస్కరించుకుని చారిత్రాత్మకమైన చార్మినార్ భాగ్యలక్ష్మిమందిరంలో మాజీ కార్పొరేటర్ పి.మమత సంతోష్‌గుప్త అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు పి.మమతసంతోష్‌గుప్తను శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### ధర్మసమాజ్ తొలి ప్లీనరికి శ్రీనివాస్‌గుప్తకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందచేస్తున్న దృశ్యం

**గోషామహల్, నవంబర్ 1ప్రభాతవార్త:** ధర్మ సమాజ్ మొదటి ప్లీనరి మహా సమ్మేళన సభకు ఆపార్టీ నేతలు, ప్రజా ఏక్తా పార్టీజాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్తను ఆహ్వానించారు. ధర్మసమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ జెవల్లిసైదులు మహారాజ్, హైదరాబాద్ జిల్లా కో కన్వీనర్ హర్షవర్ధన్ మహారాజులు, ధర్మసమాజ్ పార్టీ వ్యవస్థాపకఅధ్యక్షులు విశారధన్ మహారాజ్ ఆదేశాల మేరకు గౌలిగూడలోని ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాలశ్రీనివాస్‌గుప్తను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానపత్రికను అందచేశారు. ఈనెల 3వతేదిన అధిభట్లలోని ఓఆర్ఆర్ రోడ్డులోని కెబిఆర్ గార్డెన్‌లో ధర్మసమాజ్ పార్టీ తొలి ప్లీనరీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలతోపాటు అగ్రకులాల నిరుపేదలకు న్యాయం జరిగేందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకునే విధంగా పోరాటం చేయాల్సిన భాధ్యత తమపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగ విరమణ వయస్సుకే ..సేవా భావానికి కాదు

**-ఆర్టీసి ఈడిఓ మునిశేఖర్**



గోవర్ధనచారిని సన్మానిస్తున్న మునిశేఖర్, సిపివో గీతా, ఏవో రంగారావు ఇతర సిబ్బంది

**హైదరాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త:** ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఉద్యోగికి తప్పదని, అదికేవలం వయస్సుకే తప్పా ..సేవా భావానికి కాదని ఆర్టీసి ఈడిఓ మునిశేఖర్ అన్నారు. ఆర్టీసి ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ (ఫైనాన్స్)గా పదవి విరమణ చేసిన తొగిటి గోవర్ధనచారిని ఆర్టీసి ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొని గోవర్ధనచారిని సన్మానించారు. అనంతరం ఈడివో మునిశేఖర్ మాట్లాడుతూ విధి నిర్వాహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే ప్రజల్లో మంచిగుర్తింపు ఉంటుందని అన్నారు. ఆర్టీసిలో సేవలు అందించి ఉద్యోగుల మన్ననలు పొంది పదవివిరమణ చేయడం గొప్పవిషమని, చారి చేసిన సేవలు ఆర్టీసి ఎప్పటికి మరిచిపోదన్నారు. అంకితభావంతో పనిచేసే ఉద్యోగులు, కార్మికులకు అన్ని విధాలుగా సన్నిహితంగా ఉంటనే పూర్తి సమాచారం సేకరించవచ్చునని అన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ సిపివో గీతా, ఏవో రంగారావు, విటోబా, సంధ్య, మగ్బుల్ పాషా, శోభన్‌బాబు, పద్మావతి, నర్సయ్య, శీనప్ప, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధురాలి మెడలోంచి గొలుసు చోరీ

**హయతనగర్, నవంబరు 1 ప్రభాతవార్త:** దీపావళి పండుగ రోజున దీపాలు కొనుగోలు చేసి నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోంచి గుర్తు తెలియని దుండుగుడు బంగారు గొలుసును లాక్కుని పరారైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... తొర్రూర్ గ్రామానికి చెందిన మేకం బాలమ్మ ఈనెల 31న సాయంత్రం 5 గంటలకు తన ఇంటి సమీపంలోని కిరాణా దుకాణంలో దీపం కుందులు కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా... బైక్‌పై వెనుకనుంచి వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని 4.2 తూలాల బంగారు గొలుసుకుని లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి తొర్రూర్‌కి వచ్చి బాధితులనుంచి వివరాలు సేకరించారు.

### అమావాస్య రోజున కార్మికులు పనులు బంద్ చేయాలి



కార్మికులకు గుర్తింపు కార్డులను అందజేసిన అధ్యక్షులు మహ్మద్ హైమద్.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** అమావాస్య రోజున విధిగా కార్మికులు పనులు బంద్ చేయాలని గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మహ్మద్ హైమద్ అన్నారు. శుక్రవారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని అబీబ్ ఫాతిమా నగర్ జోన్ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. జోనల్ పరిధిలో కార్మికులు తప్పని సరిగా గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. తమ అసోసియేషన్ కోసం శాశ్వత కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వం తరపున డివిజన్ కార్పోరేటర్ సిఎన్‌రెడ్డిని కోరారు. దీపావళిని పురస్కరించుకుని కార్మికులకు మిఠాయిలను అందజేశారు. ఈకార్యక్రమంలో ముజీబ్, ఫారుక్, టైసన్ శ్రీను, వెంకటేష్, బంగారి, రాజుగౌడ్, బాలయ్య, కోటి, పాల్గొన్నారు.

## పథకాలు పేదలకు అందేలా చూడాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పి.వి రవిశేఖర్‌రెడ్డి.

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 31, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని అర్హులైన పేదలకు అందేలా చూసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెష్ నాయకులు, కన్‌జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ కార్యదర్శి డాక్టర్ పివి రవిశేఖర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రిని కలిశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలని సూచించారు.

## పోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు



అన్న దాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, నవంబరు 1 ప్రభాతవార్త :** బాబుల్‌రెడ్డి నగర్ శ్రీ పోచమ్మ దేవాలయంలో శుక్రవారం పోచమ్మ దేవాలయం వార్షి కోత్సవం, దీపావళి అమావాస్య పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మందిరం ఆవరణలో అన్న దాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శ్రీ పోచమ్మ దేవాలయం కమిటి ప్రతినిధులు వెంకటేష్, రమేష్ రెడ్డి, సంతూ గౌడ్, గోపాల్ నాయక్, శంకర్, కురుమయ్య రాజు, పాల్గొన్నారు.

### ప్రజల్లో ఐక్యతను పెంపొందించేవి పండుగలు

**ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



దీపావళి వేడుకలలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**ముషీరాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త:** ప్రజల్లో ఐక్యతను పెంపొందించేవి పండుగలేనని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా గురువారం రాత్రి ముషీరాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు శివముదిరాజ్, శ్రీధర్‌చారిల ఆధ్వర్యంలో దీపావళి పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహతో కలసి హాజరై లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టపాసులు కాల్చి నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియచేశారు. దీపావళి వెలుగులు ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దీన్‌దయాళ్ రెడ్డి, సదా, ఎండీ మోహిన్, వీరేష్, శ్రీనివాస్, రాజు, హేమచక్రధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వానికి మేలుకొలుపు కృష్ణశాస్త్రి రచనలు



కార్యక్రమంలో పాల్గొన్న కళావిఎస్.జనార్ధనమూర్తి, వంశీ రామరాజు

**చిక్కడపల్లి, నవంబరు 1 ప్రభాతవార్త:** మానవత్వానికి మేలుకొలుపు దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్యం అని వక్తలు పేర్కొన్నారు. ఎందరోమహానుభావులు మధుస్మృతులు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన సుప్రసిద్ధ సాహితీవేత్త దేవులపల్లి కృష్ణశాస్త్రి జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు మాట్లాడుతూ కవితాలోకాన కల్పవల్లి దేవులపల్లి కృష్ణశాస్త్రి అని అన్నారు. కృష్ణశాస్త్రి రాసేగీతాలు పాఠకులను తన్మయిత్వంలో మునిగితేలేలా చేస్తుందన్నారు. తెలుగు కవిత్వలోకాన కృష్ణశాస్త్రి ప్రముఖ అధ్యాయమని, తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం అని అన్నారు. మహాకవి శ్రీశ్రీ సైతం 'నేను కృష్ణశాస్త్రి కవితాశైలిని అనుకరించేవాడిని' అని పేర్కొనడం విశేషమని, ఆయనకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ఇవ్వడం తెలుగుకవికి తొలిసిరా దక్కిన గౌరవమన్నారు. గానసభ అధ్యక్షుడు కళావిఎస్. జనార్ధనమూర్తి మాట్లాడుతూ భావ కవిత్వ సార్వభౌముడు కృష్ణశాస్త్రి అని, సులువైన పదాలతో గాఢమైన భావాన్ని చెప్పగల నేర్పుకలవారన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యుడు ఎస్‌బి.రామ్, గానసభ పాలకమండలి సభ్యురాలు శ్రీలతవర్మ, గానసభ సభ్యుడు శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హషీష్ ఆయిల్ రవాణా చేస్తున్న ముఠా అరెస్టు..

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబర్ 1, ప్రభాతవార్త**

మత్తు కోసం వ్యసనాల బారిన పడుతున్న కొంతమందిని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు హషీష్ ఆయిల్ సరఫరా చేసి కాసులు సంపాదించుకుంటున్నారు. అక్రమంగా హషీష్ ఆయిల్ రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులను శుక్రవారం సైబరాబాద్ ఎస్ఓటి, బాలానగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బాలానగర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ సురేష్ కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. నిందితులు సభావత్ సుమన్, రమావత్ లాలు, కేతావత్ విజయ్ కుమార్‌లు హషీష్ ఆయిల్‌ను అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డారు. సభావత్ సుమన్‌ను 2021లో డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలోనే అతను విశాఖపట్నం జైల్లో ఉన్న సమయంలో ఒడిశాకు చెందిన మరో నిందితుడు కిరణ్‌తో పరిచయం ఏర్పడింది. వారు జైల నుండి విడుదలైన అనంతరం సులభంగా డబ్బు సంపాదించడానికి గంజాయి, హషీష్ ఆయిల్‌ను రవాణా చేయాలని ప్రణాళిక రూపొందించారు. అదే సమయంలో తనకు తెలిసిన వారికి గతంలో ఎన్డీపీఎస్ కేసులో మూడు సార్లు జైల్‌కు వెళ్లిన కేతావత్ విజయ్ కుమార్‌ను కలిసి గంజాయి కొనుగోలుకు కస్టమర్లను వెతకమని కోరారు. అదేవిధంగా కిరణ్‌ను ఒడిస్సా రాష్ట్రం నుంచి హషీష్ ఆయిల్‌ను ఏర్పాటు చేయమని చెప్పాడు. అక్టోబర్ 27వ తేదీన సభావత్ సుమన్, రమావత్ లాలు పల్సర్ బైక్‌పై నల్గొండ జిల్లా, దేవరకొండ, పోలేపల్లి గ్రామం నుండి పాడేరు వెళ్లి పోలీసుల తనిఖీలను, టోల్ గేట్లను నివారించేందుకు 1000 కిలోమీటర్లు ప్రయాణించారు. నిందితుడు కిరణ్ వారికి 2,590 లీటర్ల హషీష్ ఆయిల్‌ను డెలివరీ చేశాడు. అనంతరం కేతవత్ విజయ్ కుమార్ సమక్షంలో అక్టోబర్ 31వ తేదీన సభావత్ సుమన్, రమావత్ లాలు బాలానగర్‌లోని సనత్‌నగర్ ప్రాంతంలో కస్టమర్ల కోసం వెతుకుతూ శోభన బస్‌స్టాప్ వద్దకు చేరుకోగానే బాలానగరన, ఎస్ఓటి సైబరాబాద్, బాలానగర్ పోలీసులతో కలిసి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 12,95,000 విలువ చేసే 2.590 లీటర్లు హషీష్ ఆయిల్, పల్సర్ మోటార్ సైకిల్, 3 మొబైల్ ఫోన్లు, మొత్తం 13, 50,000 విలువ గల సొత్తును స్వాధీనం చేసుకొని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఎస్ఓటి డీసీపీ శోభన్ కుమార్, బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సిఐ నరసింహారాజు, ఎస్ఓటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

### ఐఎన్‌టియుసి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా జ్యోతి



జ్యోతికి నియామక పత్రం అందిస్తున్న అంబటి కృష్ణమూర్తి తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త:** వేతన వివక్ష, అధికపనిభారం అభద్రతా, సామాజిక సమానత్వం పొందక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అసంఘటిత రంగంలోని మహిళా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు అంబటి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం ఖైరతాబాద్‌లోని ఐఎన్‌టియుసి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ మహిళా కార్మిక నాయకురాలు నర్సేటి జ్యోతిని ఐఎన్‌టియుసి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా నియమించారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రగతిశీలమైన భారత రాజ్యాంగం స్త్రీపురుషులకు సమాన హక్కులకు హామీ ఇస్తుందని, విద్య నైపుణ్యంతో మహిళలు పురుషులకంటే ముందుకు దూసుకుపోతున్న తరుణంలో దేశంలో ఇంకా ప్రతిచోట మహిళలకు రెండవ ప్రాధాన్యత ఇవ్వబడుతుండటం దుర్మార్గమన్నారు. భారతదేశంలోని శ్రామికశక్తిలో దాదాపు 31శాతం మంది మహిళలు ఉన్నారని, అందులో 85శాతానికి పైగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని, వీరికి తక్కువ వేతనం అందుతుందని చట్టాల ప్రకారం మహిళా కార్మికులకు అందే ప్రయోజనాలు కూడా అందలేదని ఆయన వాపోయారు. మహిళ కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఉపాధి అభివృద్ధి ఫలాల్లో సమానంగా భాగస్వామ్యం కోసం కార్మికుల సంక్షేమం, భద్రతకోసం గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పోరాడి తెచ్చుకున్న 44కార్మిక చట్టాల పునరుద్ధరణకోసం బలమైన ఉద్యమాలు నిర్మించాలని ఆయన కోరారు. నర్సేటి జ్యోతి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా మహిళా సమస్యలపై వారిహక్కులపై పోరాటాలు నిర్వహించానని తనపై నమ్మకంతో ఐఎన్‌టియుసి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పజెప్పిన అంబటికృష్ణమూర్తికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు పులిపాటి సత్యదేవ్, జాతీయ కార్యదర్శి ఎస్.రాజలింగం, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి సహకార సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

**నార్సింగి, నవంబర్ 1 ప్రభాతవార్త :** గండిపేట మండలంలోని నార్సింగి సహకర సంఘం ఎన్నికలను శుక్రవారం అధికారి సీతారామయ్య సమక్షంలో నిర్వహించారు. ఈ సహకార సంఘం పరిధిలో మొత్తం 9.మంది డైరెక్టర్లు ఉన్నారు. చైర్మన్ పదవి కోసం ఖానాపూర్‌కు చెందిన తోల్‌కట్ట కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డిలు పోటీ పడ్డారు. వైస్ ఛైర్మన్ పదవికి మంచిరేవులకు చెందిన అశోక్‌రెడ్డి, నెక్నాంపూర్‌కు చెందిన సత్యనారాయణలు పోటీ పడ్డారు. కృష్ణకు 5.మంది డైరెక్టర్లు ఓట్లు వేశారు. విష్ణువర్ధన్‌రెడ్డికి నలుగురు డైరెక్టర్లు ఓట్లు వేశారు. దీంతో ఒక ఓటు తేడాతో చైర్మన్‌గా తోల్‌కట్ట కృష్ణ విజయం సాధించారని అధికారి సీతారామయ్య స్పష్టం చేశారు. అలాగే వైస్ చైర్మన్‌గా పోటీ చేసిన అశోక్‌రెడ్డికి 5ఓట్లు, సత్యనారాయణకు 4.ఓట్లు పడ్డాయి. అశోక్‌రెడ్డి ఒక ఓటుతో విజయం సాధించారు. విజేతలుగా నిలిచిన కృష్ణ, అశోక్‌రెడ్డిలకు అధికారి నియామక పత్రలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నార్సింగి సహకార సంఘం నూతన చైర్మన్ తోల్‌కట్ట కృష్ణ మాట్లాడుతూ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని పతకాలు అందేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు, రైతుబంధు, పిఎం కిసాన్ వంటి పతకాలు అందేలా చూస్తానని, పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా ప్రయత్నం చేస్తానని తోల్‌కట్ట కృష్ణ వివరించారు. చైర్మన్‌గా గెలుపొందిన కృష్ణకు రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు గండయ్య ముదిరాజ్, రామేశ్వరం నర్సిహ్మా, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, పుర ప్రముఖులు పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

**సైఫాబాద్, నవంబరు 1 ప్రభాతవార్త:** ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు గురువారం హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్ ఎదుట ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎఐటియుసి పతాకాన్ని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో బాల్‌రాజ్ మాట్లాడుతూ 1920లో అక్టోబరు 31న ముంబాయి నగరంలో లాలాల జపతిరాయ్ అధ్యక్షతన ఎఐటియుసి అవిర్భవించి నేటికి 105 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదన్నారు. నాటి నుంచి ఎఐటియుసి కార్మిక వర్గ రాజ్య స్థాపన, కార్మికుల సంక్షేమం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలను సాధించడం జరిగిందని, కార్మికుల హక్కుల కోసం ఆనేక చట్టాలు సాధించామన్నారు. నేడు దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కార్మికులు ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను జరుపుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఎం.నర్సింహ్మా, పి.ప్రేమ్‌పావని, బి.వెంకటేశం, కమతం యాదగిరి, వెంకటయ్య, బోడ్డుపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన కారు...వ్యక్తి మృతి

**గచ్చిబౌలి, నవంబరు 1 ప్రభాతవార్త :** ఔటర్ రింగురోడ్డు మీద వేగంగా వెళ్తున్న కారు టైర్ ఒక్కసారిగా పేలడంతో అదుపు తప్పిన కారు ఢివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారు తీవ్రంగా గాయపడగా, అందులో ఓ వ్యక్తి మృతి చెందాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని ఫలక్‌నూమాలో నివాసం ఉంటున్న విద్యార్థి మహ్మద్ అబ్దుల్ రహీమ్(23) తన స్నేహితులతో కలిసి గురువారం ఇన్నోవా కారులో ఔటర్ రింగురోడ్డు మీద ప్రయాణిస్తున్నాడు. ఇన్నోవా కారు(ఎపి28 డిఆర్4000)ను మహ్మద్ ఇబ్రహీం అనే వ్యక్తి నడుపుతున్నాడు. సాయంత్రం 6.30 ప్రాంతంలో కారు ఔటర్ రింగురోడ్డు మీద వట్టినాగులపల్లికి చేరుకున్న తరువాత కారు ఎడమ వైపు వెనుక టైరు ఒక్కసారిగా పేలిపోయింది. కారు వేగంగా ఉండడంతో టైరు పేలిన వెంటనే అదుపుతప్పి రోడ్డు మధ్యలో ఉన్న ఢివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, అందులో ఉన్న ప్రయాణికులు సైతం గాయాల పాలయ్యారు. కారులో ఉన్న అబ్దుల్ రహీమ్ తీవ్రంగా గాయపడగా, స్థానికుల సమాచారంలో సంఘటనా స్థలికి చేరుకున్న 108 సిబ్బంది అబ్దుల్ రహీమ్‌ను నల్లగండ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు ధృవీకరించారు. కారులో ఉన్న మిగిలిన క్షతగాత్రులు ఆసీం అహ్మద్ ఖాన్, సయ్యద్ మగ్దుం మహ్మద్, షేక్ సుఫియాన్, సయ్యద్ సైఫ్, డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ ఇబ్రహీంలకు తీవ్ర గాయాలు కాగా వీరిని ఐటి కారిడార్‌లో ఉన్న ఆసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవింగ్ చేస్తున్న మహ్మద్ ఇబ్రహీం నిర్లక్ష్యం కారణం గానే ప్రమాదం చోటుచేసుకుందని, అతనిమీద చర్యలు తీసుకో వాలని కోరుతూ అబ్దుల్ రహీమ్ కుటుంబ సభ్యులు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## శ్మశానంలో వ్యక్తికి మంటలు..

**-బయటకు పరుగులు ..**

**పంజగుట్ట, నవంబర్ 1, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లో ఓ గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం ఒంటికి నిప్పంటించుకుని నానా హంగామా చేయడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. వివరాలలోకెళితే బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోనుంచి గుర్తు తెలియని వ్యక్తికి శ్మశాన వాటికలో నిప్పంటుంది. దీంతో రక్షించమని కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశాడు. ఏం జరిగిందో అర్థంకాక స్థానికులు శ్మశానం నుండి శవం కాలుతూ బయటకు వస్తుందని భయకంపితులయ్యారు. వెంటనే అక్కడకు సమీపంలో ఉన్న జీహెచ్ఎంసీ సిబ్బంది వెంటనే తేరుకుని ఆ వ్యక్తికి అంటుకున్న మంటలను ఆర్పి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆ వ్యక్తిని ఆసుపత్రి తరలించారు. తీరా అసలు విషయమేమిటంటే..దీపావళి సందర్భంగా స్మశాన వాటికలో చనిపోయిన వారికోసం ఏర్పాటు చేసిన మందు, కల్లు తాగి అక్కడే పడిపోయాడు. బాధితుడిపైకి స్మశానంలో ఉన్న దీపం పడడంతో మంటలు ఒంటిపైకి పాకాయి. దీంతో రోడ్డుమీదకు పరుగులు తీశాడు. ఆ వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని పోలీసులు ధృవీకరించారు.



## ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### జంగయ్య, మహామద్ సలీమ్

**తలకొండపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రం అంబేద్కర్ భవనంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి సమావేశం విహెచ్‌పిఎస్ మండల అధ్యక్షుడు పెరుమాండ్ల నారాయణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా యాచారం జంగయ్య విహెచ్‌పిఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహామద్ సలీమ్ విహెచ్‌పిఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విక లాంగులు పట్ల వివక్ష వీడాలి వికలాంగుల కమిషన్ మారుగుణపడ కుండా కొనసాగించాలని ఎన్నిక ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. వృద్ధులకు వితంతువులకు 4000 రూపాయలు, వికలాం గులకు 6000 రూపాయల పెన్షన్ తక్షణమే అమలు చేయాలని లేని పక్షాన ఈ నెల 16న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన దీక్షలు, 20న ఇబ్రాహీంపట్నంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి సభ నిర్వహించడం జరుగుతుందని కావున వృద్ధులు వితం తువులు వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పోతు గంటి కృష్ణ మాదిగ ఎమార్పిఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి ఆశ్వ యాదయ్య విహెచ్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోతుగంటి శ్రీకాంత్ ఎఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి విహెచ్‌పిఎస్ నాయకులు పోతు గంటి వెంకటేష్ పెమాండ్ల విష్ణు చలిచిమల వెంకటేష్ రాజు గువ్వ జంగయ్య పెంటయ్య పోతుగంటి మహేష్ పోతుగంటి గణేష్ ఆశ్వ ప్రవలాద్ రాజు పెరుమాండ్ల శేఖర్ పెరుమాండ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తలకొండపల్లి, నవంబర్ 1 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో గ్రామపంచాయతీ సఫాయి కార్మికులు బ్యాగరీ చింతకుంట నరసింహ అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని భవగంతుని ప్రార్థిస్తూ 3000 వేల రూపాయల ఆర్థిక సహాయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా అందించారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ 2000లు ఆర్థిక సహాయం చేశారు. మాజీ ఎంపిటిసి మల్లె కేడి అంబాజీ 1000లు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అబ్బాస్ 1000ల ఆర్థిక సాయం అందజేశారు. మొత్తం 7000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ ఎంపిటిసి మల్లె కేడి అంబాజీ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ మండల కాంగ్రెస్‌పార్టీ మైనార్టీల అధ్యక్షుడు ఎండి ఆరిఫ్ నాయకులు ఎల్ మల్లేష్ ఎల్ దేవేందర్ పులిజాల విష్ణు చింతకా యల లక్ష్మణ్ యాదగిరి రమేష్ పులిజాల నర్సింహ రమేష్ రాజు లక్ష్మణ్ అంజి గ్రామపం చాయతీ సపాయి కార్మికులు వి జంగయ్య రాములుమైసయ్య యాదమ్మ వెంకటయ్య పాల్గొన్నారు.

## కేజీబీవీ అధికారిగా శ్రీలత బాధ్యతల స్వీకరణ

**నవాబుపేట, నవంబర్1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కొనసాగుతున్న కేజీబీవీ ప్రత్యేక అధికారిగా అమ్రాది శ్రీలత శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన అధికారి బదిలీపై వెళ్ళడంతో నూతనంగా ఎంపికైనా శ్రీలత బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయస్ఫూర్తితో విధులు నిర్వహిస్తానని చెప్పారు. విద్యార్థుల విద్యాభివృద్ధికీ తన వంతు కృషి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉన్నత వలితాల కోసం పాటుపడతానని అన్నారు.

## లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న పార్టీ అధ్యక్షుడు మన్‌సింగ్ ఏఎంసి చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి

**ధారూర్, నవంబర్ 1 ప్రభాతవార్త** సిఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మన్‌సింగ్ ఏఎంసి చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. స్పీకర్ ఆదేశాల మేరకు శుక్రవారం వికారాబాద్ లోని ప్రజాభవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం) కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని 13 గ్రామాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ కేరెల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి 2.5 లక్షలది ఎల్‌వోసి లెటర్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుల బుజ్జయ్య గౌడ్ గఫార్ బలవంత్‌రెడ్డి బాబాఖాన్ పాండు రమేష్ కృష్ణ యాదయ్య తిరుపతయ్య గోవర్ధన్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుపై రైతులు అవగాహ కలిగి ఉండాలి

**అక్కన్నపేట, నవంబరు 1, ప్రభాతవార్త :** కూరగాయల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీలత అన్నారు. శుక్రవారం మండలంలోని కుందనవాణిపల్లిలో కూరగాయలు సాగు చేస్తున్న రైతుల పొలాలలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యం లో ప్రస్తుతం చేనుకు తెగుళ్లు వస్తున్నాయని తెలుళ్లకు వేయాల్సిన మందుల గురించి హార్టికల్చర్ అధికారి బాలాజీతో కలసి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో తరఫున కరుణాకర్, ఆయిల్ ఫీల్డ్ ఆఫీసర్ రవళి, డ్రిప్ తరుపున భరత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మహాసభను విజయవంతం చేయాలి

**వెల్దుర్తి, నవంబరు 1 ప్రభాతవార్త:** ఈ నెల 15న తూప్రాన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించడం జరిగిందని సీపీఐ మండల కార్యదర్శి గౌరీ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం నాయకులు, అనుబంధ కార్మిక సంఘాలతో పాటు ఇతర కార్మికులు సైతం మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఆదర్శ సమాజ నిర్మాతలు గురువులే




అభినందన సభలో మాట్లాడుతున్న వికారాబాద్ కోఆర్డినేటర్ వడ్లనందు

**ధారూర్, నవంబర్ 1 ప్రభాతవార్త** విద్యార్థుల్లో అజ్ఞానం అంధకారం తొలగించి విద్యావంతులను తీర్చిదిద్దే ఆదర్శ సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని వికారాబాద్ బిజెపి కోఆర్డినేటర్ వడ్లనందు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్లో పిఆర్టీయు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎల్ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాలు ఎంపిపిఎస్ నాగస మందర్ మోహన్‌రెడ్డి పదవి విరమణ అభినందన సభ కార్యక్రమానికి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంత విజ్ఞానవంతులైన విద్యార్థులను తయారు చేసే సమాజం అంత బాగుంటుందన్నారు. అయనతోపాటు పిఎసిఎస్ వైస్ చైర్మన్ రాజునాయక్ మాజీ ఎంపిటిసి శ్రీకాంత్‌రెడ్డి శరణారెడ్డి మాజ సర్పంచ్ యాదగిరి తదితరులు ఉన్నారు.

## పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

### ఎంపిడివో రవిచంద్ర కుమార్‌రెడ్డి

**కేశంపేట, నవంబర్ 1 ప్రభాతవార్త** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక ఆర్థిక విద్య రాజకీయలకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామని ఎంపిడివో రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలో సిబ్బందికి సర్వే చేసేందుకు కావలసిన సామాగ్రిని పంపిణీ చేయడం జరిగిందని సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించడం జరిగిందని గ్రామాలలో తమ సిబ్బంది శుక్రవారం నుంచి సర్వే నిర్వహించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆజం అలీ ఏపిఎం భగవంతు జంగయ్య కిష్టయ్య రామ్మోహన్ రవి ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

### కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్



**కొడంగల్ రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త** కొడంగల్ మండలం చిన్న నందిగామ గ్రామానికి చెందిన చాకలి అంజిలమ్మకు 54,000 రూపాయల మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ చేతుల మీదుగా అంజిలమ్మ కుమారుడు చాకలి భీమప్పకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ బడుగు బలహీన వర్గాల సంక్షేమం ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహానిధి ద్వారా చికిత్సకు తగిన ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ చిన్ననందిగామ గ్రామ నాయకులు తలారి మల్లేష్ ముదిరాజ్ తిరుపతయ్య గౌడ్ పెద్ద విజ్జప్ప తదితరలు పాల్గొన్నారు.

## దీపావళి నోము మనోబలానికి సంకల్పం

### మధుసూదన్ యాదవ్, వాణిశ్రీ యాదవ్



**కొడంగల్ రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త** దీపావళి నోములు మనోబలానికి సంకల్పమని కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీ యాదవ్ అన్నారు. కొడంగల్‌లోని తన నివాసంలో కేదారేశ్వరి వ్రతం పురోహితులు కిట్టు స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ పని తలపెడుతున్నామో అది పూర్తియ్యేంత వరకు మనలో సంకల్పబలంగా ఉండాలని కుటుంబ శ్రేయస్సుకు తపించే మనసుకు తగినంత బలం అందాలంటే నోములు వ్రతాలు మన జీవనంలో ఒక బాగమయా య్యి అన్నారు. దీపావళి రోజున చేసుకుని కేదారేశ్వర వత్రం విశేష ప్రాముఖ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాహుల్ యాదవ్ శ్రీమన్‌యాదవ్ యశోద తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో రెండు పాడి గేదెలు మత్యువాత



మృతిచెందిన గేదెలు

**ఘట్‌కేసర్, నవంబర్ 1, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కరెంట్‌తీగలు తెగిపడి రెండు పాడి గేదెలు మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బీబీనగర్ మండలం మక్తాఅనంతారం గ్రామానికి చెందిన రైతు బింగి శ్రీశైలం శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్ సర్వేనంబర్ 223లో భూమిలో తన గేదెలకు గడ్డి మేపుతుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బోర్ మోటార్‌కు ఉన్న అల్యూమినియం కరెంట్ తీగ తెగిపోయి కింద పడటంతో గేదెలకు తగిలి షాక్‌కు గురై రెండు గేదెలు మృతిచెందాయి. తాను పశుపోషణ, పాలుత్పత్తిపై ఆధారం జీవిస్తున్నానని తనకు ఉన్న రెండు పాడిగేదెలు మృత్యువాత పడటంతో తనకు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈమేరకు బాధితుడు శ్రీశైలం శుక్రవారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా కారణంగానే కరెంటు తీగలు తెగిపడి ఉన్నాయని తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. ఈమేరకు ఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారని సీఐ పరశురాం తెలిపారు.

## ఘనంగా దీపావళి వేడుకలు

**వెల్దుర్తి, నవంబరు 1 ప్రభాతవార్త:** మండల వ్యాప్తంగా గురువారం దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దుకాణాలు, ఇళ్లను బంతి పూలు, మామిడి తోరణాలతో అలంకరించిన అనంతరం లక్ష్మీపూజలు నిర్వహించారు. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా సాయంత్రం దీపాలు వెలిగించి టపాసులు పేలుస్తూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల పరిధిలోని ఎం. జలాల్‌పూర్ గ్రామంలో నరకాసుర దహనం నిర్వహించారు.



## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిక్కా పట్నాయక్

**కొడంగల్ రూరల్, నవంబర్ 1 ప్రభాతవార్త** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సిక్కా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వేలో భాగంగా కొడంగల్ మండలం పర్సాపూర్ హస్లాబాద్ గ్రామాలలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తాండూర్‌సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తహసీల్దార్ విజయ్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ పర్యవేక్షించి సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందించే ప్రక్రియ కాబట్టి ప్రొఫా ర్మాను క్షుణ్ణంగా చదివి ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను పొందుపరచాలని ఆమె సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకుని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని ఆమె తెలిపారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి వివరాలను సేకరించాలని ఆమె తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్‌లు దుద్యాల మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. సర్వేలో చేపట్టాల్సిన వివిధ అంశాలను ఎన్యూమరేటర్లకు సూచించారు.

## పింఛన్ కోసం వెళ్లి మహిళ అదృశ్యం

**కొత్తూర్, నవంబర్ 1, ప్రభాతవార్త :** పింఛన్ డబ్బుల కోసం వెళ్లి మహిళా అదృశ్యమైంది. ఈ సంఘటన గురువారం కొత్తూర్ పురపాలక పరిధిలోని నారాయణగూడలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖాజాబీ అనే మహిళా పింఛన్ డబ్బులు తీసుకోవడానికి అక్టోబర్ 28న సుమారు ఉదయం 11గంటల సమయంలో పోస్ట్ ఆఫీస్‌కి వెళ్తున్నాని వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికిన కనిపించకపోవడంతో కొత్తూర్ పరిసర ప్రాంతాల్లో వెతికారు. కానీ ఆమె ఆచుకీ దొరకలేదు. దీంతో ఈనెల 31న ఖాజాబీ కొడుకు ఎండీ సలాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## దీపాలకాంతులతో గ్రామాలు, పట్టణాలు ప్రకాశించిన వేళ..



**కొత్తూర్, నవంబర్ 1, ప్రభాతవార్త :** దీపావళి పర్వదినం సందర్భంగా ప్రతి ఒక్కరు సాంప్రదాయబద్ధంగా పండుగ జరుపుకున్నారు. శ్రీలక్ష్మీదేవి కృపాకటాక్షంతో ప్రతి ఇంట్లో సరిసంపదలు కలగాలని గ్రామ పెద్దలు కొత్తూర్ పురపాలికతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దీపావళి పండుగ, గౌరీ నోములు, వ్రతాల సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ రకాల వ్యాపారవేత్తలు లక్ష్మీపూజలు ఘనంగా నిర్వహించి కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచాలు పేల్చి పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈసందర్భంగా పట్టణ పెద్దలు మాట్లాడుతూ.... దీపావళి పండుగ అనేది భారతతీయ సంస్కృతిలో అత్యంత ప్రముఖమైన పండుగల్లో ఒకటి. దీపావళి దుష్టశక్తులపై శ్రేయమూర్తుల విజయానికి సంకేతంగా దీపావళినిని జరుపుకుంటారు. ప్రజలు తమ ఇళ్లను శుభ్రపర్చుకుని, రంగులతో అలంకరించి, దీపాలను వెలిగిస్తారు. ఇంట్లో సంతోషం, శుభం కలుగుతందనే విశ్వాసంతో లక్ష్మీదేవిని పూజిస్తారన్నారు. ఈపూజాబాబులాల్, విష్ణుచారి, ఎం.అంజయ్య, బి.విష్ణుకుమార్, ఎం.రాజు, శ్రీశైలం, తేజేశ్వర్, కుమార్, తరుణ్, దీపక్, తదితరులు ఉన్నారు.

## భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసమే సర్వే

### మునిసిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న



డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కమీషనర్

**తాండూరు, నవంబరు 1, ప్రభాతవార్త:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధ్వర్యంలో అమృత్ 2.0లో బాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తాండూరు మునిసి పల్ మాస్టర్ ప్లాన్ డ్రోన్ డిజిటల్ సర్వే ప్రారంభమైంది. ఇప్పటికే డిటిసిపి సర్వే ఆఫ్ ఇండియా అధ్వర్యంలో గత మూడు, నాలుగు రోజులుగా భౌగోళక సర్వే చేపట్టారు. శుక్రవారం తాండూరు మునిసిపల్ పరిధి పాత తాండూరులోని మునిసిపల్ సరిహద్దు ప్రాంతంలో డ్రోన్‌ను గగనంలోకి పంపించి సర్వేను ప్రారంభించారు. ఈ ప్రక్రియను మునిసిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, కమీషనర్ విక్రమ్ సింహారెడ్డి, డిటిసిపి అర్బన్ అధికారిణి హరిత, టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్‌లు పరిశీలించారు. వారి సమక్షంలో సర్వే ఆఫ్ ఇండియా బృందం సభ్యులు గోపాల్‌రావు అధ్వర్యంలో డ్రోన్‌ను ఆకాశంలో ఎగురవేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ రాబోయే 20 ఏండ్లలో తాండూరు అభివృద్ధికి కావలసిన ప్రక్రియను మాస్టర్ ప్లాన్ ద్వారా చేపట్టబోతున్నామని అన్నారు. రోడ్లు, మురుగు కాలువలు నీటి కుంటలు తదితర వాటిని గుర్తించి ప్రజలకు అవసరమయ్యే సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు సర్వే దోహదపడుతుందని అన్నారు. డిటిసిపి అధికారిణి హరిత మాట్లాడుతూ డ్రోన్ సర్వే ద్వారా తాండూరు మునిసిపల్ పరిధిలో సుమారు 6 వేల ఎకరాలను పరిశీలించడం జరుగుతుందని అన్నారు. రోడ్లు, భవనాలు, నీటి వనరులు, పార్కులు మౌళిక వసతుల స్థితిని పరిశీలించి నివేదిక రూపొందించడం జరుగుతుందని అన్నారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ లాలప్ప, లైసెన్స్‌డ్ ఇంజనీర్ అలీ, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

**గజ్వేల్ టౌన్, నవంబరు 1 (ప్రభాతవార్త):** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 40వ వర్ధంతిని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో గురువారం గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ నర్సింహా రెడ్డి, వహీద్, యాదయ్య, గంగిశెట్టి రాజు, నక్క రాములుగౌడ్, గాడిపల్లి శ్రీను, సుభాష్‌చంద్రబోస్, పాల్గొన్నారు.

## టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడును అభినందించిన ప్రకాష్‌గౌడ్



**శంషాబాద్, నవంబర్ 1 ప్రభాతవార్త** తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా నియమితులైన టీవీ5 గౌవర చైర్మన్ బిఆర్‌నాయడును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కలిసి అభినందించారు. గత అనేక సంవత్సరాలుగా ఆధ్యాత్మిమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న బిఆర్‌నాయుడును టిటిడి బోర్డు చైర్మన్‌గా నియమించడం ఎంతో అభినందనీయమని అన్నారు. హిందూ సంస్కృతి సాంప్రదాయాలపై ఎనలేని విశ్వాసం కలిగిన వ్యక్తిని చైర్మన్‌గా నియమించడం ద్వారా తిరుమల తిరుపతికి వెళ్లే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు హిందూ మనోభావాలను పెంపొందించే అవకాశం ఉంటుందని ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా బిఆర్‌నాయుడునును శాలువాతో ఆయన సన్మానించారు.

## తెలంగాణ గురుకుల పాఠశాలల్లో సంబరాలు

### ప్రభుత్వం డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచటం పట్ల హర్షం



విద్యార్థులు కేకలు కట్ చేసి సంబరాలు జరుపుకున్న దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 1, ప్రభాతవార్త**

తెలంగాణ గురుకుల పాఠశాల విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లిలో ఉన్న తెలంగాణ మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో విద్యార్థులు సంబరాలు జరుపుకుని, కేక్‌ను కట్ చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచటంతో తెలంగాణ ప్రభుత్వానికి దన్యవాదాలు తెలియజేస్తూ సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేయటం, కేక్‌లు కట్ చేసి సంబరాలను విద్యార్థులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి జరుపుకున్నారు. అదే విధంగ శామీర్‌పేటలో ఉన్న తెలంగాణ మహత్మాజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు సంబరాలను జరుపుకుని కేక్‌లను కట్ చేయటం సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేయటం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచటం పట్ల హర్షం వ్యక్తం చేసి దన్యవాదాలు తెలియజేశారు.

## పశువులకు గాలికుంటు టీకాలు వేయాలి



రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

**షాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త :** పశువులకు తప్పనిసరిగా గాలికుంటు టీకాలు వేయాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏట్లఎర్రవల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోదక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....పశువుల పెంపకంలో రైతులు పెంపకం ధరలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. పశువులకు ముందస్తు టీకాలు తప్పనిసరిగా వేయాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యులు, రైతులు తదితరులు ఉన్నారు.

## ఇందిరాగాంధీకి ఘన నివాళి



**షాబాద్, నవంబర్ 1, ప్రభాతవార్త :** ఇందిరాగాంధీ అడుగుజాడలో నడవాలని కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు కావలి చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రతి ఒక్కరు ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని దేశ ప్రయోజనాల కోసం ప్రాణాలను సైతంపణ్ణంగా పెట్టిన ఘనత ఇందిరమ్మదేనని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మాజీ సర్పంచులు జనార్ధన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ఆంజనేయులుగౌడ్, నాయకులు ఖుద్దూస్, సుభాష్‌రెడ్డి, గౌరీశ్వర్, సత్యం, సంజీవరెడ్డి, జానీ, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మల్లేష్, జంగయ్య, రఫీక్, రాఘవేందర్, ప్రవీణ్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే.. జైలుకే : ఎస్ఐ

**అక్కన్నపేట, నవంబరు 1, ప్రభాతవార్త :** మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమైతే ఓనర్లను జైలుకు పంపుతామని ఎస్ఐ విజయ్ భాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు వారి పిల్లల చదువుతోపాటు భవిష్యత్తుపై దృష్టిసారించి నడవడికను ఎప్పటి కప్పుడు గమనించాలన్నారు. పిల్లలు మత్తు, గంజాయి, సిగరేట్ లాంటి అలవాట్లకు లోనవకుండా చూసుకోవాల్సిన బాద్యత తల్లితండ్రులదేనని, వారిని సేచ్ఛగా వొదిలేస్తే భవిష్యత్తులో చెడు వ్యసనాలకు లోనై జీవితాన్ని నాషణం చేసుకునే అవకశం లేకపోలేదన్నారు. వారికి సెల్‌ఫోన్‌లు ఇచ్చినప్పుడు ఎందుకోసం వాడుతున్నారు. వాహణాలు ఇచ్చినప్పుడు ఎక్కడికి వెళ్తున్నారని అడగి తెలుసుకోవాలన్నారు. ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు పిల్లల వల్లనే జరుగుతున్నాయని సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని 24 గంటలలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు తిరిగి పొందే అవకాశం ఉందన్నారు.

## పత్తి తీతలో జాగ్రత్తలు పాటించాలి : ఎవో

**మర్కుక్, నవంబరు 1 (ప్రభాతవార్త):** రైతులు పత్తి పంట సాగు చేసే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో పత్తి తీసే సమయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పలు పత్తి పంటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి పంటలో ప్రస్తు తం మంచు అధికంగా కురుస్తున్నందున మంచు తగ్గాక పత్తి తీయాలని, అధిక వేడి ఉన్నప్పుడు పత్తిని తీస్తే వెంటనే నీడలో వేయాలని, ఇలా చేస్తే తేమ తగ్గి పత్తి నాణ్యతగా ఉంటుందని తెలిపారు. పత్తి విప్పిన 5 నుండి 6 రోజుల్లో పత్తిని ఏరాలని, లేనిపక్షంలో తేమ ఎక్కువై సూటిమోల్డ్ వచ్చే అవకాశం ఉందని, రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించినట్ల యితే అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు.

## పౌర హక్కుల పై అవగాహన పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వార్డెన్

**మర్పల్లి నవంబరు 1 ప్రభాతవార్త :** మర్పల్లి మండలంలోని కోంషట్టిపల్లి గ్రామంలో సోమవారం నాడుపౌరహక్కుల సమావేశం నిర్వహించారు. దార్గులపల్లి వార్డెన్ తుల్జరాంగౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌరహక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని అన్నారు. పిల్లలను పనిలో పెట్టుకోరాదు, 18సంవత్సరాలు నిండనిదే ఆడపిల్ల పెండ్లి చేయ రాదన్నారు. కులమతాలకు అతీతంగా అందరూ గ్రామంలో జీవించాని అన్నారు. ఆర్.ఐ, వెంకటయ్య మాట్లాడుతూ గ్రామంలో ఆసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చూడాలని అన్నారు ఎ ఎస్ఐ వెంకటయ్య, గ్రామ కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఇది విద్యార్థుల పోరాట విజయం

**మర్పల్లి నవంబరు 1ప్రభాతవార్త:** రాష్ట్రంలోని హాస్టళ్ళ,గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలను పెంచినందుకు పీసి విద్యార్థుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవికుమార్‌యాదవ్ ముఖ్యమంత్రికి, ఉపముఖ్య మంత్రికి కృతజ్ఞతలుతెలిపారు. ఈపెరుగుదల గతం కంటె మంచి గుంద న్నారు. 8 లక్ష50 వేల విద్యార్థులకు ప్రయోజనం చేకూరు తుందన్నారు. కాలేజీ, హాస్టళ్ళకు 1500 నుండి 2100, గురుకుల, హాస్టళ్ళలో 3వ తరగతి నుండి 7వ తరగతి వరకు 950 చనుండి 1330, 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు 1100నుండి1540 వరకు పెంచారని,ఆదే విధంగా కాస్మోటిక్ ఛార్జీలు పెంపుదల పట్ల విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారని మంచిగా మెనూ తయారు చేసి పౌష్టికఆహారం పెట్టాలని ఆయన కోరారు.

## ప్రశాంతంగా జిలుగు వెలుగుల దీపావళి

**నవాబుపేట,నవంబరు1 ప్రభాతవార్త:** మండల ప్రజలు గురువారం జిలుగు వెలుగుల దీపావళి పర్వదినాన్ని ప్రశాంతంగా జరుపుకున్నారు. ఎప్పటిలాగే చిన్నారుల కేరింతలతో ఇంటింట దీపావళి వేడుకలను అంగరంగవైభవంగా జరిగాయి.హిందువుల ఇళ్ళలో ప్రమిదలను వెలిగించి,టపాసులు కాల్చిసంబురాలను కనులవిందుగా జరుపుకున్నారు. వయో భేదం లేకుండా ఈ వేడుకలు కొనసాగాయి. ప్రత్యేకంగా లక్ష్మీదేవి పూజలు చేశారు. వ్యాపార సముదాయాలను తిరోక్కపూలతో అలంకరించి శుభాలు కలగాలని, వ్యాపారం దినదిన లభివృద్ధి సాధించాలని వేదపండితుల మంత్రోశ్చారణ మధ్య పూజలు చేశారు.

## కెజిబివి అధికారిగా శ్రీలత బాధ్యతల స్వీకరణ


కెజిబివి అధికారిగా బాధ్యతలు తీసుకుంటున్న శ్రీలత

**నవాబుపేట,నవంబరు1 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కొనసాగుతున్న కేజీబీవీ ప్రత్యేక అధికారిగా అమ్రాదిశ్రీలత శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన అధికారి బదిలీపై వెళ్ళడంతో నూతనంగా ఎంపికైనా శ్రీలత బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయస్ఫూర్తితో విధులు నిర్వహిస్తానని చెప్పారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉన్నత ఫలితాల కోసం పాటుపడతానని అన్నారు.

## ఆర్డీవో సరితను కలుసుకున్న టిఎన్జీవో నేతలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (నవంబరు 01)** : షాద్‌నగర్ తాలుకా టీఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆనంద్ సింగ్, తాలుకా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తాలుకా ప్రచార కార్యదర్శి శ్రీహరి, బాలవర్ధన్, ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ రాకేష్‌లు షాద్‌నగర్ ఆర్డీవో ఎన్.ఆర్.సరితను మర్యాదపూర్వకంగా కలుసుకొని అభినందలు తెలిపారు. అనంతరం ఆర్డీవోకు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

## విద్యుత్ షాక్‌కు గురై కార్మికుడు మృతి

**షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 1,(ప్రభాతవార్త) :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం వెలిజర్ల గ్రామ సమీపంలో ఉన్న వెంకటేశ్వర హ్యాచరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుడు విద్యుత్ షాక్ గురై మృతి సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గత రెండు రోజుల క్రితం పరిశ్రమలో రోజువారిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ కరెంటు రిపేర్ చేస్తు షాక్ గుర య్యారు. సంఘటనను చూసిన తోటి కార్మికులు చంద్రశేఖర్‌ను ఓ ఆసు పత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరా బాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న అతని పరిస్థితి విషమించి శుక్రవారం చనిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు మృతుని కుటుంబానికి పరిశ్రమ యాజమాన్యం తగిన న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## షాద్‌నగర్ బస్టాండ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి.

**షాద్‌నగర్‌రూరల్, నవంబర్1, (ప్రభాతవార్త) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రాత్రి వేళల్లో అక్కడే ఉండే యాచకులు, ఆర్టీసీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి ఎక్కడి నుంచో షాద్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడని, రాత్రి సమయంలో ఇక్కడే నిద్రించి గురువారం తెల్లవారుజామున దుకాణాల సముదాయం ముందు మృతిచెంది కనిపించాడని వారు తెలిపారు. ఈ విషయమై ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు, 108 కు సమాచారం అందజేశారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న 108సిబ్బంది జగదీష్ మృతదేహాన్ని పరిశీలించి మధ్యరాత్రి పిడ్స్ వచ్చి చనిపోయినట్లు నిర్ధారణ చేశారు. అనంతరం అంబులెన్స్ డ్రైవర్ యాదయ్య సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు. మృతుని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### వరి కొనుగోలు కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలి



**దుద్యాల్,నవంబర్1,ప్రభాతవార్త ః** దుద్యాల్ మండల కేంద్రంలో శుక్రవారం ఎఎంసీ వైస్ చైర్మన్ వేణుగోపాల్,పిఎసీఎస్ చైర్మన్ జయకృష్ణ అధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రను ప్రారంభించడం జరిగిందని తెలిపారు.రైతులు వరి కొనుగోలుకేంద్రంను సద్విని యోగంచేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని వారు తెలిపారు.రైతులకు ప్రభుత్వం 48గంటలలో ధాన్యం కొనుగోలు డబ్బులనువారి బ్యాంకుఖాతాలో జమాచేయడం జరుగు తందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీరేష్‌బాబు,ఆర్ఐ రవి కిషోర్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు మేరుగు వెంకటయ్య, ఖాజ,ఖలీల్, ఎల్లప్ప పాల్గోన్నారు.

# ఘనంగా సదర్ కార్యక్రమాలు

**-ముఖ్యఅతిథిగా విచ్చేసిన క్యామ మల్లేష్**


శేరిగూడలో సదరు ఉత్సవాల్లో పాల్గొన్న మల్లేష్

**ఆదిభట్ల నవంబరు1,ప్రభాతవార్త :** రాష్ట్రంలో దీపావళి పర్వదినం రోజు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కార్యక్రమాలలో సదర్ కార్యక్రమం ఎంతో ప్రత్యేమైనది. ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలోని శేరిగూడ గ్రామంలో ఎల్లపల్లి వారి వంశస్థులు ప్రతి ఏటా గత ఐదు సంవత్సరాలుగా ఈ సదరు సయాట కార్యక్రమం ఏర్పాటు చేస్తు న్నారు.అదేవిధంగా ఈ సంవత్సరం కూడా ఎంతో ఘనంగా సదరు సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు.
దున్నపోతులను అందంగా అలంకరించి వాటితో ఆడించి పాడించి సదరు ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరిపారు.ఈకార్యక్రమానికి అతిథిగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త భూవనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేష్ విచ్చేశారు .అనంతరం ఆయన మాట్లాడుతూ... యాదవుల ఐక్యతకు ప్రతీకగా జరుపుకునే సదరు పండుగంటే పట్నంలో మాత్రమే జరుపుకునే పండుగల పరిగణించేవారు.
కానీ ఈ మధ్య కాలంలో సదరుపండగు ఊరూరా వ్యాపించి ప్రతి ఒక్కరికి చేరువ చేశారని శేరిగూడ గ్రామంలోని ఎల్లపల్లి వారసులు ముందుకు వచ్చి ప్రతి ఏటా ఈ కార్యక్రమం నిర్వ హించడం సంతోషకరంగాఉందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారాయాదవుల ఐక్యతను ప్రపంచానికి చాటి చేప్పె విధంగా ముందుకు సాగా లని అన్నారు.
ఈ కార్యక్రమంలో బిఎన్ రెడ్డిడివిజన్ కార్పొరేటర్ తుర్క యంజాల్‌మున్సిపల్ కౌన్సి లర్ కొత్తకురుమశివకుమార్ ఇబ్రహీం పట్నం కౌన్సిలర్లు అల్వాల వెంకటరఎడ్డి, ఈర్లపల్లి వెంకటరెడ్డి, ఎద్దుల జంగారెడ్డి, క్యామశంకర్, ఎల్లపల్లి వారసులు, గ్రామస్తులు, పెద్దలు యువకులు భారీ ఎత్తున హాజరయ్యారు.

# ఎమ్మెల్యే ఇంట దీపావళి వేడుకలు


దీపావళి వేడుకలను జరుపుకుంటున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 01 :** చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఒక దీపావళి అంటూ చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఇంట్లో దీపావళి సందడి నెలకొంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో తన కుటుంబంలోని చిన్నారులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారు.ఎమ్మెల్యేగా గెలుపొందాక మొదటిసారి దీపావళి వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి విజయం సాధించిన రోజు దీపావళి అని, రాష్ట్రంలో కూడా చెడు పోయి మంచి జరిగిందని భవిష్యత్తు కూడా మంచిగానే జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు, అన్ని వర్గాలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.
ఎమ్మెల్యేను ఆశీర్వదించిన పురోహితులు దీపావళిని పురస్కరించుకొని స్థానిక పురోహితులు రవిశర్మ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ప్రత్యేకంగా కలిసి ఆశీర్వదించారు. రాజకీయ మరియు ప్రాంతాభివృద్ధి సాధించాలని దీవించారు.

## షాద్‌నగర్ నుండి అరుణాచలానికి బస్సు సర్వీసు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 01 :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ మరియు పరిసర ప్రాంత భక్తులకు ఆర్టీసీ శుభవార్త తెలిపింది. తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షణి చేయాలనుకునే భక్తులకు శివదర్శనార్థమై కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబరు 15న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు సంస్థ సిబ్బంది రాయికల్ వెంకటేష్ తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి 7 గంటలకు షాద్‌నగర్ బస్ స్టేషన్ నుండి బయల్దేరి 14వ తేదీ ఉదయం 6 గంటలకు కాణిపాకం చేరు కుంటు ందని వారు తెలిపారు.
కాణిపాకంలో దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు వెల్లూర్‌లోని గోల్డెన్ టెంపుల్‌కు చేరుకుంటుందని, దర్శనం అనంతరం రాత్రి వరకు అరుణాచలం చేరుకొని 15వ తేదీ గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత సాయంత్రం 4 గంటలకు అరుణాచలం నుండి బయల్దేరి షాద్‌నగర్ బస్ స్టేషన్‌కు 16వ తేదీ ఉదయం 5 గంటలకు తమ గమ్యస్థానం చేరుకుంటుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ.3,600/-, పిల్లలకు రూ.2,400/-గా నిర్ణయించినట్లు తెలిపారు. కావున ఆసక్తి గల భక్తులు 9490021433, 9182645281, 9959226287 నెంబర్లను సంప్రదించాలని షాద్‌నగర్ ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## ఇందిరాగాంధి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలి

**టిపిసిసి మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్**

**పెద్దేముల్, నవంబరు 1,ప్రభాతవార్త:** స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధి ఆశయ సాధనకు ప్రతిఒక్కరు కృషిచేయాలని టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి.రియాజ్ పిలుపునిచ్చారు.గురువారం ఇందిరాగాంధి వర్ధంతిని పురస్కరించుకొని పెద్దేముల్ మండల కేంద్రంలో ఆమే చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ యంపిటిసి విద్యాసాగర్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్ గుప్తా, గ్రామ కమిటి అధ్యక్షుడు డివై నర్సిములు, సీనియర్ నాయకులు కోహీర్‌రవి, కోళ్ళ గోపాల్, రాజరత్నం, ఏక్బాల్, కోళ్ళ పెంటప్ప, కారోబార్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంజారాల సంస్కృతికి ప్రతీక తీజ్ పండుగ


తీజ్ పండుగ వేడుకలలో పాల్గొన్న తాండావాసులు

**పెద్దేముల్, నవంబరు 1, ప్రభాతవార్త:** బంజారుల సంస్కృతికి ప్రతీక తీజ్ పండుగని మండల పిఆర్‌టియు అధ్యక్షుడు పోల నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం మారెపల్లితాండాలో తీజ్ పండుగ వేడు కలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయానికి చాటి చెప్పె పండు గలలో అతి ముఖ్యమైనది తీజ్‌పండుగ అని అన్నారు. ఉపాధ్యాయులు పట్లోల్ల రమేష్, అంగన్‌వాడి కార్యకర్త ఆర్తిబాయి పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి

**దుద్యాల్,నవంబరు1,ప్రభాతవార్త ః** దుద్యాల్ మండలంలోని సోమ్లునాయక్ తాండకు చెందిన బాల్‌సింగ్‌కు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో మృతి చెందడం జరిగింది.బాల్‌సింగ్ తెలిపిన వివరాల ప్రకారం పంట పొలంలో ఆవు మేత మేస్తూండగా ప్రక్కనే ఉన్న ట్రాన్స్‌ఫర్మర్ మెయిన్‌లైన్‌కు తాకి విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందడం జరిగిందని తెలిపారు.
సంఘటన స్థలంకు ఆర్ఐ రవికిషోర్,వెటర్నరీ అసిస్టెంట్,విద్యుత్ లైన్‌మెన్ కరీంలు సంఘటన స్థలంకు చెరుకొని పంచనామ నిర్వహంచడం జరిగిందని వివ రాలను విద్యుత్ అధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.అప్పుచేసి ఆవు ను కొనుగోలు చేయడం జరిగిందని ప్రభుత్వం తమకు పరిహారం చెల్లించి అదుకోవాలని బాధితరైతు కోరారు.

## నేటి నుంచి కార్తీకమాస పూజలు ప్రారంభం
### - రోజూ అన్నప్రసాద వితరణ

**ఘట్‌కేసర్, నవంబరు 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబమల్లికార్జునస్వామి దేవాలయంలో శనివారం నుంచి కార్తీకమాస పూజలు ప్రారంభం కానున్నాయి. ఆలయంలో నెల రోజుల పాటు జరిగే కార్తీకమాస పూజల కోసం అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త కంట్లం గౌరీశంకర్ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు మల్లికార్జునస్వామికి అభిషేకం నిర్వహిస్తామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ పూజలు పాల్గొని కార్తీక దీపారాధన చేస్తారని తెలిపారు.
నెలరోజుల పాటు ఆలయంలో కార్తీక పూజలు ఉంటాయని, ప్రతి రోజు అన్నప్రసాద వితరణ చేస్తారని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని గౌరీశంకర్ కోరారు.

## షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌ను కలిసిన ఆర్డీవో ఎన్.ఆర్.సరిత


ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఆర్డీవో ఎన్.ఆర్. సరిత

**షాద్‌నగర్, ప్రభాతవార్త, నవంబరు 01 :** షాద్‌నగర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో)గా నూతనంగా బదిలీపై వచ్చిన ఎన్.ఆర్.సరిత స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల మొక్కను బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేదలు రెవెన్యూ పరంగా అందించాలని సూచించారు. పేద రతులు ఎంతో మంది కార్యాలయానికి పనివేళల్లో వస్తూ ఉంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కల్పించకుండా ప్రభుత్వ పనులు చేసి పెట్టాలని ఈ సందర్భంగాఎన్.ఆర్.సరితకు ఎమ్మెల్యే శంకర్ సూచించారు. విధి నిర్వ హణలో ఎలాంటి ఇబ్బందులు ప్రజలకు తలెత్తకుండా తనవంతు కృషి చేస్తానని ఎన్.ఆర్. సరిత పేర్కొన్నారు.

## పూడూర్‌లో ఘనంగా సదర్ ఉత్సవాలు


పూడూర్ గ్రామంలో దున్నలతో విన్యానాలు చేయిస్తున్న యాదవులు

**మేడ్చల్, నవంబర్ 1. ప్రభాతవార్త ః** మేడ్చల్ మండలంలోని పూడూర్ గ్రామంలో శుక్రవారం సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ బాబు యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఉత్సవాల్లో పలువురు యాదవులు పాడి పశువులను, దున్నపోతులను అలంకరించారు. అనంతరం దున్నలను గ్రామంలోని మల్లన్న ఆలయం వద్ద పూజలు జరిపి వాటితో విన్యాసాలు చేయించారు. ఈ ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, కౌన్సిరల్ స్వామి యాదవ్, నాయకులు మధూకర్ యాదవ్, నాగేష్, లక్ష్మణ్‌యాదవ్, మహేందర్, శివకుమార్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, యాదవులు ఎల్లంబాయి, గోపాల్ యాదవ్, మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ వల్లబాయ్ పటేల్‌కు ఘన నివాళి


సర్దార్ పటేల్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు

**మేడ్చల్, నవంబర్ 1. ప్రభాతవార్త ః** మేడ్చల్ మండలంలోని మునీరాబాద్ గ్రామంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలను శుక్రవారం బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహనికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, గుండ్లపోచంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, నాయకులు గణేష్, కృష్ణాగౌడ్, రవీందర్ గౌడ్, జంగారెడ్డి, బాబు పాల్గొన్నారు.

## రాష్ట్ర క్రికెట్ జట్టుకు ఎంపికైన తాండూరు అమ్మాయి

**తాండూరు, నవంబరు 1,ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన అమ్మాయి బిసిసిఐ అండర్ 15 బాలికల విభాగం రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. తాండూరు పట్టణంలోని లెజెండ్ క్రికెట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న సి.భవిష్యరెడ్డి జిల్లా నుంచి హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ అండర్ 15 (బిసిసిఐ గర్ల్స్ అండర్ 15 ట్రోఫి) రాష్ట్ర జట్టులో మొట్టమొదటి సారిగా జిల్లా నుంచి చిన్న వయసులో ( 12 ఏళ్ళు 2 నెలలు ) అర్హత సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం తాండూరు పట్టణంలోని లెజెండ్ క్రికెట్ అకాడమిలో భవిష్యరెడ్డిని అకాడమి ప్రతినిధులు అభినందించి ఘనంగా సన్మానించా ఈ విజయానికి సహకరించిన లెజెండ్ క్రికెట్ అకాడమి కోచ్‌లు ఎండి.సాహిల్,ఎండి, సోహేల్‌కు విద్యార్థిని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల పాలిట వరం సిఎం రిలీఫ్ ఫండ్

**-డిసిసి ఉపాధ్యక్షులు బొలుసని భీమ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బిఎస్.ఆంజనేయులు**

**కుల్కచర్ల, నవంబరు 01, ప్రభాతవార్త ః** పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్ అని డీసీసీ ఉపాధ్యక్షుడు బొలుసని భీమ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బిఎస్.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలో పరిగి శాసనసభ్యులు టి.రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో లబ్ధిదారులు రామ్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి పార్వతమ్మ రూ.12,000, బొట్య నాయక్‌తండ గ్రామానికి చెందిన విస్లావత్ రమేష్ నాయక్ లకు రూ15,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధ పడుతూ చికిత్స తీసుకున్న బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటూ వారికి సహాయం అందించడానికి ముందుంటుందని తెలిపారు. పేదల పక్షాన నిలబడిన కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి పేదల కోసం, మహిళల కోసం రైతుల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు ఇస్తున్నారని వారికి తెలిపారు.జిల్లా యువజన నాయకులు కుమ్మరిస్వామి, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, ఆనంద్, బాబు పాల్గొన్నారు.

### మానసిక ధృడత్వానికి క్రీడలు ఎంతో అవసరం : గజ్జి రామకృష్ణ


బహుమతులు అందజేస్తున్న రామకృష్ణ తదితరులు

**యాచారం నవంబరు1,ప్రభాతవార్త :** శారీరకంగా,మానసికంగా క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని మట్టిలో మాణిక్యాలు క్రీడాల ద్వారానే వెలుగులోకి వస్తారని యాచారం మాజీ ఉపాధ్యక్షుడు గజ్జి రామ కృష్ణ అన్నారు.దీపావళి సందర్భంగా గున్‌గల్ గ్రామశాఖ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఎస్‌పిఎల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ గున్‌గల్ గ్రామంలో నిర్వహించారు.గెలుపొందిన వారికి బహుమతి ప్రధానోత్సవకార్యక్రమం నిర్వహించి బహుమతులు అందించారు.ఈ కార్య క్రమంలో గజ్జి రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ...క్రీడలు నేటి సమా జంలో ఎంతో అవసరం అన్నారు.శారీరకంగానే కాకుండా ఆరోగ్యం, మాన సిక ఎదుగుదల క్రీడల వల్లే సాధ్యమని అన్నారు.అనంతరం ఫైనల్లో గెలిచిన కొంచరి శివ టీమ్‌కి మొదటి బహుమతి రూ.10 వేల నగదు అంద జేశారు.రెండవ బహుమతి రూ.5వేల నగదు ఇక్కే వెంకటేష్ టీమ్‌కు అందజేశారు.బ్యాటింగ్‌లో నైపుణ్యం ప్రదర్శించిన మహేష్‌కి,బౌలర్ మల్లగాళ్ల జగదీష్‌కి మ్యాన్ ఆఫ్ ది సిరిస్ పంతంగి అనిల్‌కి ట్రోపిలు అందజేశారు. యాచారం మండల సహకార బ్యాంకు చైర్మన్ తోటిరెడ్డి ,రాజేందర్‌రెడ్డి,బాసాని బుచ్చిరెడ్డి,కషమళ్ల శ్రీనివాస్, గిరామోని రవీందర్, సింగంరావు, భీమ్, బుర్కిఅశోక్,పూజారి రాకేష్, పంతంగి సురేష్, గొట్టం మహేష్, గున్‌గల్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలి

**-ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు,యాచారం సిఐ శంకర్ నాయక్**


క్రీడాకారులతో ఎసిపి కెవిపిరాజు,సిఐ శంకర్‌రాజు,ఎస్సై,తదితరులు

**యాచారం నవంబరు1,ప్రభాతవార్త :** యువత చెడు అలవాట్లకు పోయి తమ బంగారు జీవితాలను నాశనం చేసుకోవద్దని ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు తెలిపారు.క్రీడలు మానసిక ఉల్లాసానికి ,శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని ఉద్దేశంతో యాచారం మండలం మాల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి అతిథిగా ఇబ్రహీంపట్నం ఎసిపి కెవిపి రాజు,యాచారం సిఐ శంకర్ నాయక్ హాజరై మాట్లా డారు...యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థానాలకు చేరాలని యువతకు సూచించారు.యువత చెడు అలవాట్ల వైపు పోకుండా క్రీడల వైపు మొగ్గు చూపాలని కోరారు.అనంతరం మొదటి బహుమతి రూ.1 0.116,రెండో బహుమతి రూ.5.116,మూడో బహుమతి రూ. 2000 బహుమతులు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో ఎస్సై సత్య నారాయణ, ఎఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, విహెచ్ఎస్ మండల అధ్యక్షుడు దేరంగుల ఈశ్వర్,కాంగ్రెస్ పార్టీగ్రామశాఖ అధ్యక్షుడు గుడుగుంట్ల రమేష్, గొల్లపల్లి వెంకటేష్, హైస్కూల్ చైర్మన్ గుడుగుంట్ల కృష్ణ, టోర్నమెంట్ ఆర్గనైజర్ చిన్నోల శ్రీకాంత్,చెలిమల బాలకృష్ణ,మించరాజు,వంశీ,గణేష్,రమేష్ పాల్గొన్నారు.

### కాస్మొటిక్ చార్జీల పెంపుపై హర్షం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

**కొడంగల్,నవంబరు1,ప్రభాతవార్త ః** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం ఎనుములరేవంత్‌రెడ్డి,ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్వర్యంలో మహాత్మాజ్యోతిపూలే తెలంగాణ వెనకబడిన తరగతుల గురుకుల పాఠశాల విద్యార్థులకు 5నుండి 7వ తరగతికి 950 నుండి 1330 రూపాయాలు, 8నుండి 10వ తరగతికి 1100నుండి 1540రూపాయాలకు పెంచడం జరిగిందని డైట చార్జీలు 30శాతం, కాస్మోటిక్ చార్జీలు40శాతం పెంచిప సందర్భంగా మహాత్మా జ్యోతిపూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాల (బాలురు) కొడంగల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్,ఎటీపీ కాశప్ప, ఉపాధ్యాయులు విద్యార్థుల తరపున కేక్‌కట్‌చేసి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యావాదములు తెలిపారు. మసూద్‌అలీ, ప్రభు, వెంకట్రాములు, శంకరయ్య, స్వాతి, నరేష్, షబానా తదితరులు పాల్గోన్నారు.

## ఘట్‌కేసర్‌లో ఉత్సాహంగా సదర్ వేడుకలు

**ఘట్‌కేసర్, నవంబరు 1, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో సదర్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలోని వాసవీటవర్స్ ఆవరణలో యాదవ సంఘం అధ్యక్షులు రాజబోయిన యాదగిరియాదవ్, ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ముళ్లి పావని జంగయ్యయాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. దీపావళీ పండుగ సందర్భంగా సాయంత్రం యాదవులు సదర్ వేడుకలను జరిపారు. అంతకుముందు యాదవ సంఘం భవనంలో శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేశారు.
మున్సిపల్ చైర్‌పర్సన్ ముళ్లి పావని జంగయ్యయాదవ్, ఇన్‌స్పెక్టర్ పి.పరశురాం, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్‌లతో పాటు సంఘం సభ్యులు శ్రీకృష్ణభగవాన్‌కి పూజలు చేసి సదర్ ఉత్సవాన్ని ప్రారంభించారు. దున్నపోతులను అలంకరించి హనుమాన్‌నగర్ నుంచి మున్సిపల్ కార్యాలయం, ఎదులాబాద్‌రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ఊరేగించారు. గెదేలను నూనెతో మెరిస్తూ, వాటి కొమ్ములను రంగులు వేసి మెడచుట్టూ దండలు, పాదాలకు చీలమండలు, మెడ నుదటిపై గంటలతో సీ-షెల్‌బ్యాండ్‌లె, వాటి కొమ్ములపై నెమలి ఈకలతో అలంకరించారు. హజరైన పలువురు దున్నల విన్యాసాలను తిలకించారు. సదర్‌లో పాల్గొన్న నాయకులను శాలువాలతో సన్మానించి తలను పగిడి ధరింపచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిధులకు జ్ఞాపికలను అందజేశారు. ప్రజాప్రతినిదులు, యాదవసంఘం సభ్యులు, పాల్గొన్నారు.

## ఘనంగా దీపావళి పండుగ

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 01,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాల్లో గురదీం దీపావళి పండుగను ఘనంగ జరుపుకున్నారు. గ్రామాల్లోని యువకు,మహిళలు, చిన్నారు. టపాసులు కాల్చి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపు కున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువకులు,చిన్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.